## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లితండ్రులు ముందుకు రావాలని మారేడుపల్లి మండల డిప్యూటీ ఐఓఎస్ మదన్మోహన్ అన్నారు. చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్యాబోధన, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ, ఉచిత పాఠ్య పుస్తకాలు అందజేస్తారన్నారు. ఒత్తిడి లేని విద్యాబోధనే ప్రభుత్వ పాఠశాలల లక్ష్యమన్నారు. అనంతరం బడిబాట వాల్‌పోస్టర్ ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జలంధర్‌రెడ్డి, శారద మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, ఎం.వి.ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ, రమాదేవి, రేణుక, మల్లేష్, కుమార్, లావణ్య, సుమలత, దేవుడు కుమార్, నాగమణి, నరేష్, సోమయ్య పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ అన్నారు. బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టి, ఆత్మగౌరవ నినాదంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌ది అన్నారు. కంటోన్మెంట్ నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు సభకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల నాగేష్, టీఎన్ శ్రీనివాస్, నివేదిత, జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, నళిని, భాగ్యశ్రీ, శ్యామ్ కుమార్, లోకనాథం పాల్గొన్నారు.

## పాదయాత్రలతో బీఆర్ఎస్ సభకు ప్రచారం



వాల్‌రైటింగ్ చేస్తున్న సామల హేమ

సికింద్రాబాద్: వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని గురువారం సీతాఫల్‌మండి డివిజన్‌లో బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో బీఎస్ఆర్ గార్డెన్ వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్ర వివిధ బస్తీల గుండా నిర్వహించారు. మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో జనం రావాలని వాల్‌రైటింగ్ చేయడంతో పాటు, పోస్టర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే రాజు, నవీన్, మణిమంజరి, విజయలక్ష్మి, లక్ష్మి, అనిత,అరుణ, రేవతి, పింకి పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

బన్సీలాల్‌పేట్: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, నాయకులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేషన్ రాజు, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి మహేష్, హరిచారి, సాయిరాం, మహేందర్ గౌడ్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్ బీఆర్ఎస్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.


## మహనీయులపై వ్యాసరచన పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీలో గురువారం తెలంగాణ విద్యార్థి ఫోరం (టీవీఎఫ్) ఆధ్వర్యంలో మహనీయులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏప్రిల్‌లో వరుసగా వచ్చే మహనీయులు జయంతిని పురస్కరించుకొని మహాత్మా జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర, వారి ఆశయాలు అనే అంశం పై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు టీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆశాడపు మధు తెలిపారు. మహనీయుల స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు తెలియచేసి వారిలో చైతన్యం కోసం ఈ పోటీలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, పవన్ యాదవ్, అనస్‌ఖాన్, హరికృష్ణ, నరేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# అవే సమస్యలు.. తప్పని తిప్పలు



తార్నాక కూడలిలో మెట్రో పిల్లర్లు




మెట్టుగూడ-ఓయూ, హబ్సిగూడ-లాలాపేట వైపు వెళ్లే వాహనాలకు నిషేధాజ్ఞల సూచిక

### రహదారుల విస్తరణ లేదు

- యూ, రైట్ టర్న్‌లపై ఆంక్షలు
- నడి రోడ్డులో మెట్రో పిల్లర్లు
- ఇబ్బందులపాలవుతున్న వాహనదారులు
- తలపట్టుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు

సికింద్రాబాద్/లాలాపేట: పదేళ్ల క్రితం తార్నాక జంక్షన్ మూసివేతకు విముక్తి కలిగింది. ఇటీవల అధికారులు ఈ రహదారి గుండా వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. వారం రోజుల క్రితం నుంచి కూడలి మీదుగా వాహనాల రాకపోకల ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ఈ పరిణామం, అధికారుల నిర్ణయం హర్షణీయమే. అయితే తగిన ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు జాగ్రత్తలు లేకుండా జంక్షన్‌ను ఓపెన్ చేయడం ట్రాఫిక్ పోలీసులకు సవాల్‌గా మారింది. రోజంతా ట్రాఫిక్ సమస్యల మధ్య వాహనదారులు సైతం ఇక్కట్లకు గురవుతున్నారు. జంక్షన్ మూసివేతను ఎత్తివేసినప్పటికీ రెండు మార్గాల్లో రైట్ టర్న్‌లు, యూ టర్న్‌లు లేకపోవడం ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరం అవుతున్నాయి. ఇదిలా ఉండగా రెండు మార్గాల్లో ఆంక్షలు విధించినప్పటికీ ట్రాఫిక్‌ను అదుపు చేయడం తలభారంగా మారుతుందని, ఆంక్షలు ఎత్తివేస్తే కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరే ప్రమాదం ఉందని ట్రాఫిక్ పోలీసులు వెల్లడిస్తున్నారు.

### మెట్రో పిల్లర్లతో సమస్యలు..

తార్నాక కూడలిలో ఉన్న మెట్రో పిల్లర్లు ట్రాఫిక్ సమస్యలకు హేతువులుగా మారుతున్నాయి. కూడలి నుంచి సుదర్శన్‌రెడ్డి స్వీట్‌హౌజ్ వరకు తార్నాక వంతెనను ఆనుకుని మెట్రో పిల్లర్లు ఉన్నాయి. రహదారి మధ్యలోంచి పిల్లర్లు ఉండడంతో ఇక్కడి నుంచి ఆరాధన థియేటర్ మీదుగా మూడు మార్గాలకు వెళ్లాల్సిన వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లర్లను దాటుకుని వచ్చే వాహనాలు ఓయూ, లాలాపేట వైపు వెళ్లడం సమస్యాత్మకంగా మారుతుండడంతో ఈ మార్గంలో రైట్ టర్న్, యూ టర్న్‌ను మూసివేశారు. విద్యానగర్, అడిక్‌మెట్, ఓయూ నుంచి వచ్చే వాహనాలు కూడలి దాటుకుని లాలాపేట, హబ్సిగూడ మార్గంలో వెళ్లడం కోసం రోడ్డుకు నడిమధ్యలో మెట్రోపిల్లర్ ఉండడం ఆటంకంగా మారుతుంది. ఇదే పిల్లర్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలు యూ టర్న్, రైట్ టర్న్ తీసుకోకుండా ఆంక్షలు విధించారు. దీంతో ఈ రెండు మార్గాల్లోని వాహనదారులు గమ్యస్థానాలు చేరడం కోసం పాత పద్ధతుల్లోనే కిలోమీటర్ దూరం వరకు వెళ్లి యూ టర్న్ తీసుకోవాల్సి వస్తోంది.

### భారీగా వాహనాల బారులు.....

తార్నాక జంక్షన్ నుంచి వాహనాల రాకపోకల పునరుద్ధరణ పట్ల వాహనదారుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతుంది. రహదారుల ఇరుకు కారణంగా ట్రాఫిక్ సమస్యలు రోజంతా ఉంటుండగా ఉదయం, సాయంత్రం కార్యాలయాల రాకపోకల సందర్భాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. లాలాపేట మార్గంలో ఫ్లై ఓవర్ వరకు, హబ్సిగూడ మార్గంలో సుదర్శన్‌రెడ్డి స్వీట్‌హౌజ్ వరకు, మెట్టుగూడ మార్గంలో మెట్రో స్టేషన్ వరకు బారులు తీరుతున్నాయి. పది మంది ట్రాఫిక్ పోలీసులు దినమంతా కూడలిలోనే తిష్టవేస్తే తప్ప ట్రాఫిక్ సమస్యలకు కొంతమేర ఉపశమనం లభించే అవకాశం ఉండడం లేదు.



లాలాపేట-ఓయూ మార్గంలో నడిరోడ్డు మధ్యలో పిల్లర్

### విస్తరణ చేయకుండానే పునరుద్ధరణ..

కూడలిని విస్తరణ చేయకుండానే వాహనాల రాకపోకలు పునరుద్ధరించడంతోనే సమస్యలు పునరావృతం అవుతున్నాయని ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. కూడలి ఇరుకుగా ఉండి ట్రాఫిక్ సమస్యలు జటిలం అవుతున్న నేపథ్యంలోనే అప్పటి అధికారులు జంక్షన్‌ను మూసివేశారని, ఎటువంటి విస్తరణ చేయకుండా పదేళ్ల అనంతరం వాహనాల సంఖ్య నాలుగింతలు అయ్యాక జంక్షన్‌ను పునరుద్ధరించడం సమంజసం కాదని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జంక్షన్ మీదుగా వాహనాల పునరుద్ధరణ కోసం నాలుగు నెలలు కసరత్తు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు తార్నాక కూడలిలో ఎటువంటి విస్తరణ పనులు చేపట్టకుండా వాహనాల రాకపోకలను అనుమతించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులకు, ఓయూ అధికారులకు భూ సేకరణ ద్వారా పరిహారం చెల్లించి కూడలి విస్తరణ కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. కూడలి మీదుగా వాహనాల రాకపోకల పునరుద్ధరణలో ఎదురవుతున్న సమస్యలు గుర్తించి కూడలి విస్తరణ దిశగా చర్యలు తీసుకోవాలని తార్నాక వాసులు కోరుతున్నారు.

## నేడు జీఓ-317 బాధితుల నిరసన

లాలాపేట: జీఓ 317 బాధితులకు న్యాయం ఇంకెప్పుడు అంటూ శుక్రవారం ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ సెక్రటరీ జనరల్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ 317తో స్థానికత కోల్పోయిన వారికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు. గత అక్టోబర్ 2న మంత్రులు న్యాయం చేస్తామని మాట ఇచ్చారన్నారు. ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన అంశాన్ని పరిష్కరించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

## వీసీకి మోడల్ స్కూల్ టీచర్ల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ లేదా టైం స్కేల్ హోదా కల్పించాలని ఓయూ మోడల్ స్కూల్ టీచర్లు వీసీ ప్రొ.కుమార్ వినతి పత్రం ఇచ్చారు. యూనివర్సిటీ క్యాంపస్ బీఈడీ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న ఓయూ మోడల్ స్కూల్‌లో ఒక్క పర్మనెంట్ టీచర్ కూడా లేరని వీసీకి వివరించినట్లు కాంట్రాక్టు టీచర్లు డా.భిక్షపతి, జహంగిర్ పేర్కొన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన తక్కువ వేతనానికి గత 15 ఏళ్లుగా పని చేస్తున్న 14 మంది టీచర్లను రెగ్యులర్ లేదా టైంస్కేల్ ఉద్యోగుల హోదా కల్పించాలని కోరగా వీసీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

## గృహిణి అదృశ్యం

సనత్‌నగర్: గృహిణి అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కర్నూల్‌కు చెందిన నల్లదాసరపల్లి బాలరాజ్ వ్యాపార నిమిత్తం నగరానికి వచ్చి భార్య మౌనికతో కలిసి ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 21న ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు బాలరాజ్ రోజువారి విధులకు వెళ్లి రాత్రి ఇంటికి రాగా మౌనిక కనిపించలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు వివిధ అనుబంధ కాలేజీల్లో పని చేస్తున్న పార్టుటైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత మూడు రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం దండోర మోగించారు. ఓయూ క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజీ నుంచి వీసీ పాలన భవనం వరకు డప్పు వాయిద్యంతో నినాదాలు చేస్తూ కవాతు చేపట్టారు. పీజీ, పీహెచ్‌డీ, యూజీసీ నెట్ తదితర అర్హతలతో పాటు రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఉద్యోగాలకు ఎంపికైన పార్ట్‌టైం అధ్యాపకులపై చిన్నచూపు తగదన్నారు. తక్కువ వేతనంలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపక ఉద్యోగాల నియామకానికి విడుదల చేసిన జీవో 21లో కనీసం వెయిటేజ్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.సోమేశ్వర్, కార్యదర్శి జానకి రెడ్డి, ఉపాధ్యక్షులు డా. ఎస్వీ రత్నం, డా.సుందర్, డా.యుగేందర్, డా.దుబ్బ రంజిత్, డా.వరలక్ష్మీ, డా.విష్ణు భూపతి, డా.శంకర్, డా.మధు, డా.కర్ణాకర్, డా.కవిత, డా.శ్రీదేవి, డా.సాగరిక తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



మణెమ్మ

గాంధీఆస్పత్రి: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లికి తోడుగా వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్, బండమీదిపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ (36) గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తల్లికి తోడుగా ఉంటుంది. ఈ నెల 23న మందుల తెస్తానని చెప్పి బయటకు వెళ్లిన మణెమ్మ ఎంతకీ వార్డుకు రాలేదు. స్వగ్రామంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోదరుడు సత్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## అన్నపై తమ్ముడి దాడి

సనత్‌నగర్: కుటుంబ కలహాలతో అన్నపై తమ్ముడు కర్రతో దాడి చేసిన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మోతీనగర్ పీఆర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉండే రాజారావు (41) ఒక్లహోమా ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తుంటాడు. ఈ నెల 21న అతడి తమ్ముడు సత్యనారాయణ మొదటి అంతస్తులో ఉండే తన ఇంట్లోకి చొరబడి తల్లి పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండడంతో ఆ సమయంలో రాజారావు భార్య అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో ఆమెనూ దుర్భాషలాడాడు. ఈ విషయమై రాజారావు తన తమ్ముడు సత్యనారాయణను నిలదీయగా కర్రతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తనపై దాడికి పాల్పడ్డ సత్యనారాయణపై చర్యలు తీసుకోవావాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## పాస్టర్స్, మైనారిటీ అట్రాసిటీ ప్రివెంటివ్ యాక్ట్ తీసుకురావాలి

రాంగోపాల్‌పేట్: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో క్రైస్తవ సమాజం మొత్తం తీవ్ర ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్స్, మైనారిటీ అట్రాసిటీ ప్రివెంటివ్ యాక్ట్‌ను తీసుకురావాలని యాక్ట్ సాధన సమితి కన్వీనర్ పీవీ యోహాన్, ప్రతినిధులు ఉదయ్ కుమార్, పద్మశారా, సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. పాస్టర్ ప్రవీణ్‌ను మతోన్మాదులు హత్య చేశారనే అనుమానాలను క్రైస్తవ సమాజం మొత్తం నమ్ముతుందని అందుకే పాస్టర్స్, మైనార్టీ ప్రివెంటివ్ యాక్ట్ సాధన సమితిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ యాక్ట్ సాధన కోసం పోలీసులు, కోర్టులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలను కలిసి మద్దతు కోరుతున్నామన్నారు.

# పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రతి పేద కుటుంబానికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**సేవాగుణం ఉండాలి..**

ఇతరులకు సేవ చేయడం ద్వారా మనశ్శాంతితో పాటు, సేవ చేసే వారికి మంచి జరుగుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సత్యసాయి బాబా శివైక్యం అయిన రోజును స్మరించుకుంటూ సత్య సాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జేబీఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. శ్రీ సత్య సాయి బాబా మార్గంలో నడుస్తూ సేవా కార్యక్రమాలు చేయడమే ఆయన పట్ల చూపే నిజమైన భక్తి అన్నారు. మానవ సేవే-మాధవ సేవ అని , అన్ని మతాలు, కులాల కన్నా మానవత్వమే గొప్ప అన్నారు. తనకు జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా తనకు ఎంతో మంచి జరిగిందన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మధుకర్ నాయక్‌తో మాట్లాడుతున్న భానుక నర్మద

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్, పేర్కొన్నారు. గురువారం ఆమె సీఈఓను కలిసి పలు అంశాలపై చర్చించారు. వేసవి ముగిసేలోపు కంటోన్మెంట్ పరిధిలోని రెండు ప్రధాన నాలాల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని పార్కుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరారు. పలు కాలనీల్లో రెయిలింగ్‌లు, పిల్లల ఆట వస్తువులు తుప్పు పట్టాయని సీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

## టెక్నోస్మానియా ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీలో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మాయా-2025 ప్రారంభమైంది. గురువారం కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.రమేష్‌కుమార్ అధ్యక్షత వహించగా రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి, కన్వీనర్ డా.శ్రీనునాయక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే టెక్నోస్మానియా కార్యక్రమంలో సదస్సులు, పోస్టర్ ప్రజెంటేషన్, ఎగ్జిబిషన్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శిరీష్ హెచ్ సోనావానే, హయవదన, రాజం, డా.అభిలాష్, డా. శ్రీనివాసులు, డా.భాస్కర్, డా.అనిత, డా.పరుశురామ్, డా.సారం ఐలయ్య, డా.టి జ్యోతి, డా.సునీత, డా.కవిత, డా.పరమేశ్వర్లు, డా.అర్జున్, డా.రేణు, డా.అజిత్, పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కాలనీలప్రజలు



నివాళులర్పిస్తున్న గాంధీ టీఎన్‌జీవో సంఘం ప్రతినిధులు



మినర్వా కాంప్లెక్స్‌లో నివాళి అర్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్



తార్నాక చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రామ్‌చందర్‌రావు



నివాళి అర్పిస్తున్న డా.ప్రేమ్‌కుమార్

## ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలు

కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి గురువారం సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ, మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్ నివాళులర్పించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి టీఎన్జీవో ఆధ్వర్యంలో సంతాపర్యాలీ నిర్వహించగా, బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. బీజేపీ యువమోర్చా జిల్లా నాయకులు పవన్ పటేల్ ఆధ్వర్యంలో న్యూబోయిగూడ రాఘవేంద్రహోటల్ నుంచి బ్రిడ్జి వరకు ర్యాలీ చేపట్టగా, తార్నాకలో బీజేపీ నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామ్ చందర్‌రావు పాల్గొని పాకిస్థాన్ దిష్టబొమ్మను దహనం చేశారు.సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్ మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై పార్కు చుట్టుపక్కన ఉన్న కాలనీలవాసులు పాల్గొన్నారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్లబృందం



కొవ్వొత్తుల ప్రదర్శనలో బీజేపీ నాయకులు



బీజేపీ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ